లేదు. అందుకే ఈసారి మరింత పైకి ఎగరేశాడు. ఈసారి కూడా ఫలితం వచ్చినట్టు లేదు. ముచ్చెంగా మూడోసారి ఎగరేసి చూసుకున్నాడు. కోరుకున్న ఫలితం వచ్చుండదు. అందుకే నాణాన్ని కోపంతో విసిరికొట్టాడు. అది తిన్నగా వెళ్లి ఒక పెద్దాయన ముందు పడింది. ఆయన ఓసారి అటూఇటూ చూసి తనని ఎవరూ గమనించ లేదని నిశ్చయం కాగానే.. దాన్ని తీసుకొని జేబులో వేసుకున్నాడు.

వినీత్ గుంభనంగా నవ్వుకున్నాడు.

* * *

మర్నాటి ఉదయం గుడికెళ్లడానికి తయారవుతూ కిటికీలోంచి చూస్తే వంతెన చివరే కనిపించాడా బిచ్చగాడు. క్రమశిక్షణలో వాడు తనలాంటి వాళ్లందరినీ తలదన్నేలా ఉన్నాడనిపించింది. అంత క్రమశిక్షణ కలిగినవాడు ఇంత విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడంటే.. అది వెర్రితనమో పిచ్చితనమో అయివుండదు. అయినా దానం తీసుకోని బిచ్చగాడు ఎక్కడైనా ఉంటాడా? ఆ అనుమానంతోపాటుగానే అతణ్ని తన దగ్గర దానం తీసుకునేలా చెయ్యాలనే పట్టుదల కూడా కలిగింది.

అందుకే గుడినుంచి వచ్చేప్పుడు బిచ్చగాడి ముందు కెళ్లి నిలబడ్డాడు. అతని కళ్లముందు యాభై రూపాయల కాయితం పెట్టాడు. ఆ బిచ్చగాడు కాగితాన్నే చూస్తున్నాడు. కానీ, అతని చూపుల్లోని భావరాహిత్యం మాత్రం అలాగే ఉంది. వందకాయితం చూపించినా.. రెండువందలు, ఐదువందల కాయితాలు చూపించినా ఆ కళ్లలోకి వెలుగు రాలేదు.

రెండువేల కాయితం రద్దయిపోయింది. లేకపోతే దాన్నీ చూపించి ఉండేవాడు. రద్దు చెయ్యడానికే ప్రవేశపెట్టిన కాయితమది. కనుక రద్దయినా బాధలేదు. కానీ, తన పట్టుదల మాత్రం రద్దుకాదు. అందుకే జేబులో ఉన్న డబ్బంతా తీసి అతని కళ్లముందు పెట్టాడు.

అయినా ఆ కళ్లలో అదే నిరాసక్తత. అదే నిర్లిప్తత. ఆ చూపుల్లోని భావరాహిత్యం వినీత్‌ని సవాలు చేస్తూనే ఉంది. అందుకే బిచ్చగాడి వైపు కోపంగా చూస్తూ..

‘‘అడుక్కునే వాడు ఎంతేస్తే



‘నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2023/24’లో విశిష్ట బహుమతి పొందిన కథ.